
సాక్షి
ఖమ్మం
శుక్రవారం । 11 । జూలై । 2025



ఒకరు లేదా ఇద్దరు చాలు!



అంతకు మించితే పోషణ భారమే.. ● 'సాక్షి' సర్వేలో జంటల నోట ఇదే మాట ● సంతానం విషయంలో నేటి తరంలో స్పష్టత

ఖమ్మంసహకారనగర్/కొత్తగూడెం అర్బన్: నానాటికీ జనాభా పెరుగుతోంది. ఇదే సమయాన జీవన వ్యయమూ అధికమవుతోంది. ఫలితంగా గతంతో పోలిస్తే యువత భావాల్లో మార్పులు వస్తున్నాయి. జనాభా పెరుగుదలకు తోడు పోషణ భారంతో సంతానం విషయంలో పెళ్లికి ముందు నుంచే స్పష్టతకు వస్తున్నారు. ఒకరు లేదా ఇద్దరు సంతానంతో సరిపెట్టుకోవాలని నిర్ణయించుకుంటున్నారు. ఇద్దరూ ఉద్యోగం చేస్తే తప్ప కుటుంబాలు గడవని పరిస్థితుల్లో పిల్లల పోషణ కష్టమవుతుందనే భావనతో ఒక సంతానానికే పరిమితమవుతున్నారు. ఇంకొందరు మాత్రం కుటుంబ పెద్దల ఒత్తిడితో రెండో సంతానానికి జన్మనిస్తున్నారు. అయితే, ఒకే సంతానంతో భవిష్యత్‌లో వృద్ధుల సంఖ్య పెరిగి యువజనుల సంఖ్య తగ్గుతుందనే ఆందోళన వ్యక్తమవుతోంది. అయినప్పటికీ ఇద్దరికి మించి సంతానం దాటితే విద్య, వైద్యం.. ఇతర అంశాలతో పాటు ఉద్యోగాల ఒత్తిడితో వారి బాగోగులు చూడడం ఎలా అన్న భావనతో జంటలు లెక్కకు మిక్కిలి సంతానానికి వెనుకడుగు వేస్తున్నాయి.

తోడు ఉండాలని..

నేటి తరంలో చాలా జంటలు ఒకే సంతానానికి పరిమితమతున్నా, ఇంకొందరు మాత్రం ఇద్దరు పిల్లలైతేనే తోడుగా ఉంటారనే భావనతో రెండో సంతానానికి మొగ్గు చూపుతున్నారు. అయినా పోషణ విషయంలో ఆందోళన వ్యక్తమవుతోంది. నేడు(శుక్రవారం) ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఉమ్మడి జిల్లాలో 60జంటలను నాలుగు ప్రశ్నలతో సర్వే చేయగా సంతానం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. ఇందులో సంతానం ఒకరే చాలా అన్న ప్రశ్నకు.. ఎక్కువ మంది ఇద్దరైతే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఒకే సంతానంతో వారిలో ఒంటరితనం ఎదురవుతుందా అన్న ప్రశ్నకు అలాంటిదేమీ ఉండదని, అయినా తప్పదని సమానంగా సమాధానాలు వచ్చాయి. ఎక్కువ సంతానం వద్దనడానికి పోషణ, సంరక్షణ భారమే కారణమా అని అడిగితే అవుననే ఎక్కువమంది బదులిచ్చారు. యువజనం తగ్గనుండడంతో ఇద్దరినైనా కనాలన్న సూచనలపై ఆరాతీస్తే ఆలోచించాల్సిన అంశమేనని చెప్పడం గమనార్హం.

ఇద్దరు తప్పనిసరి..



ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరు పిల్లలు ఉండడం మంచిది. తద్వారా ఒకరికి ఒకరు తోడు నిలిస్తే ధైర్యం, భరోసాగా ఉంటుంది. ఇప్పటి ఖర్చులను బేరీజు వేసుకుంటే ఇద్దరిని పోషించడం కష్టమే. అయినా మంచీ, చెడుల్లో సహకరించుకోవడానికి అవకాశం ఉంటుంది.

– ఎన్.శ్రీనివాస్ – మౌనిక, ఖమ్మం

ఇద్దరైతేనే తోడూనీడ



ప్రస్తుత పరిస్థితుల్లో ఇద్దరు పిల్లలు ఉండాల్సిందే. తద్వారా వారే ఒకరికొకరు తోడుగా ఉంటారు. ఒంటరి వారమనే భావన రాదు. కానీ ప్రసుత్త తరుణం విద్య, వైద్యానికి పెరుగుతున్న ఖర్చులతో చాలా మంది ఒక సంతానానికే పరిమితం అవుతున్నారు.

– సుధీర్ – శ్రీలత, ఖమ్మం

న్యూస్‌రీల్

సాక్షి వద్దకే న్యాయాధికారి



వాంగ్మూలం నమోదు చేస్తున్న న్యాయాధికారి నాగలక్ష్మి

ఖమ్మం లీగల్: ఖమ్మం సంచార ప్రత్యేక న్యాయస్థానం న్యాయాధికారి బి.నాగలక్ష్మి గురువారం ఓ కేసు విచారణ సందర్భంగా సాక్షి దివ్యాంగుడు కావడంతో ఆయన ఉన్న ఆటో వద్దకే వెళ్లి వాంగ్మూలం నమోదు చేశారు. జిల్లాలోని సింగరేణి ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసులో లావుడియా సురేష్ సాక్షిగా ఉన్నాడు. ఆయన దివ్యాంగుడు కావడంతో ఆటోలో తీసుకొచ్చినా కిందకు దింపడం కష్టమైంది. దీంతో వాహనం వద్దకే వెళ్లిన న్యాయాధికారి వాంగ్మూలాన్ని నమోదు చేశారు.

వైరా రిజర్వాయర్ నుంచి నీటి విడుదల

వైరా: వైరా రిజర్వాయర్ కింద వరి సాగు చేయనున్న రైతుల కోసం కుడి, ఎడమ కాల్వల ద్వారా అధికారులు గురువారం నీటిని విడుదల చేశారు. రిజర్వాయర్‌లో ప్రస్తుతం 17అడుగుల మేర నీరు ఉండడమే కాక 70 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. దీంతో కాల్వల ద్వారా రోజుకు 50 క్యూసెక్కుల చొప్పున నీటి విడుదలకు నిర్ణయించారు. వరి సాగు చేయనున్న రైతులు నార్లు పోస్తుండడంతో వారు ఇబ్బంది పడకుండా వారం పాటు అనధికారికంగా నీరు విడుదల చేస్తున్నారు.

ఆగస్టులోగా కోడిగుడ్ల సరఫరా టెండర్లు

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలోని సంక్షేమ హాస్టళ్ల(రెసిడెన్షియల్ పాఠశాలలు), అంగన్‌వాడీ కేంద్రాలకు అవసరమైన కోడిగుడ్ల సరఫరా కోసం ఆగస్టు మొదటి వారంలోగా టెండర్లు ఖరారు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం ఆమె మరో అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డితో కలిసి పలు అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా శ్రీజ మాట్లాడుతూ హాస్టళ్లు, కేజీబీవీలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ఇతర విద్యాసంస్థలకు జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలోనే అవసరమైన కోడిగుడ్లు కొనుగోలు చేయాల్సి ఉంటుందన్నారు. అలాగే, శిథిలావస్థ భవనాల్లో కొనసాగుతున్న హాస్టళ్లు, అంగన్‌వాడీ కేంద్రాలను ఇంకో చోట మార్చాలని సూచించిన ఆమె హాస్టళ్ల మెనూ అమలుపై తనిఖీ చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో వివిధ శాఖల అధికారులు కస్తాల సత్యనారాయణ, ఎస్.విజయలక్ష్మి, డాక్టర్ పురందర్, నర్సయ్య, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

మిల్లర్లు సీఎంఆర్ సకాలంలో అప్పగించాలి

ఖమ్మం సహకారనగర్: జిల్లాలోని మిల్లర్లు సీఎంఆర్(కస్టమ్ మిల్లింగ్ రైస్)ను సకాలంలో అప్పగించాలని అదనపు కలెక్టర్ పి.శ్రీనివాసరెడ్డి సూచించారు. కలెక్టరేట్‌లో గురువారం రైస్‌మిల్లర్లతో సమావేశమయ్యారు. గత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి పెండింగ్ ఉన్న బియ్యం అప్పగించడమే కాక ఈ ఏడాది యాసంగి సీఎంఆర్ అందజేయడం మొదలుపెట్టాలని తెలిపారు. ఈసమావేశంలో జిల్లా పౌర సరఫరాల శాఖ డీసీఎస్‌ఓ చందన్‌కుమార్, జిల్లా పౌర సరఫరాల సంస్థ మేనేజర్ శ్రీలత, మిల్లర్ల అసోసియేషన్ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

40రోజుల్లోగా ఇళ్ల నిర్మాణం ప్రారంభించకపోతే రద్దు

రఘునాథపాలెం: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో లబ్ధిదారులు వేగం పెంచాలని జెడ్పీ సీఈవో దీక్ష రైనా సూచించారు. మంజూరైన నలభై రోజుల్లోగా నిర్మాణ పనులు ప్రారంభించకపోతే రద్దయ్యే ప్రమాదముందని ఆమె తెలిపారు. రఘునాథపాలెం మండలం చింతగుర్తిలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను గురువారం పరిశీలించిన ఆమె మాట్లాడారు. మండలంలో ఇప్పటివరకు 1,303 ఇళ్లు మంజూరు కాగా, లబ్ధిదారులంతా నిర్మాణ పనులు మొదలుపెట్టాలన్నారు. తద్వారా దశల వారీగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. ఎంపీడీఓ అశోక్‌కుమార్, హౌసింగ్ ఏఈ పుష్ప, గ్రామ కార్యదర్శి రాంబాబు, మాజీ సర్పంచ్ తమ్మిన నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించాలి

బోనకల్: ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలు అందగానే లబ్ధిదారులు నిర్మాణాలను ప్రారంభించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత సూచించారు. మండలంలోని కలకోటలో గురువారం ఆమె పలు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి మాట్లాడారు. నిర్మాణం జరుగుతుంటే దశల వారీగా బిల్లులు మంజూరవుతాయని తెలిపారు. ఎంపీఓ శాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

సంస్థాగతంగా బలోపేతానికి చర్యలు



మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి, పక్కన నాయకులు

- త్వరలోనే పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కమిటీల నియామకం
- మాజీ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి

సాక్షిప్రతినిధి, ఖమ్మం: కాంగ్రెస్ పార్టీని పోలింగ్ బూత్ నుంచి జాతీయ స్థాయి వరకు బలోపేతం చేయడంపై దృష్టి సారించినట్లు కాంగ్రెస్ పార్టీ సంస్థాగత నిర్మాణాల ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి తెలిపారు. ఖమ్మంలోని డీసీసీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా కాంగ్రెస్ కమిటీల నియామకం కోసం గుజరాత్‌లో పైలట్ ప్రాజెక్టును అమలుచేయగా స్వయంగా ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పర్యవేక్షించారని తెలిపారు. అదే మాదిరి తెలంగాణలో కూడా కాంగ్రెస్ పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేసేందుకు ఉమ్మడి ఖమ్మం జిల్లాకు తనతోపాటు ఇతర జిల్లాలకు తొమ్మిది మంది ఇన్‌చార్జిలను నియమించారని చెప్పారు. రాష్ట్రస్థాయిలో ఖాళీగా ఉన్న నామినేటెడ్, ప్రభుత్వ బోర్డుల డైరెక్టర్లు, సభ్యుల నియామకం కోసం ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పార్టీ కోసం కష్టించిన వారిలో ఇద్దరికి తగ్గకుండా పేర్లను ఈనెల 12లోగా ప్రతిపాదిస్తామని తెలిపారు. అంతేకాక జిల్లా కాంగ్రెస్ కమిటీలను సమీక్షించి నూతన కమిటీల ఏర్పాటుకు అర్హులైన వారిని టీపీసీసీకి ప్రతిపాదిస్తామని వెల్లడించారు. జిల్లా, మండల స్థాయి కమిటీల నియామకం తర్వాత గ్రామ కమిటీలతో పాటు పోలింగ్ బూత్ కమిటీలను నియమిస్తామని, ఈ విషయంలో పొలిటికల్ ఎఫైర్స్ కమిటీ మీటింగ్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. జిల్లా, మండల కమిటీలో 50 శాతానికి తగ్గకుండా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ వర్గాలకు ప్రాతినిధ్యం కల్పించనున్నామని, ప్రతీ కమిటీలో 50 శాతానికి తగ్గకుండా 50 ఏళ్ల వయసు లోపువారిని నియమిస్తామని చెప్పారు. కాగా, కాంగ్రెస్ పార్టీలో గ్రూపులు ఉండవని, భిన్నాభిప్రాయాలు మాత్రమే ఉంటాయని, అందరిదీ సోనియాగాంధీ, మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీ గ్రూపు అని తెలిపారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక దేశంలో ఎక్కడా లేనట్టుగా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. అయితే, రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కీలక పాత్ర పోషించిన ఉమ్మడి ఖమ్మం జిల్లా నాయకులు, కేడర్‌కి ప్రత్యేకంగా కృతజ్ఞతలు చెబుతున్నామని వెల్లడించారు. ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయితో పాటు డాక్టర్ శ్రవణ్‌కుమార్‌రెడ్డి, నాగా సీతారాములు, మద్ది శ్రీనివాసరెడ్డి, పెసర మహిపాల్‌రెడ్డి, జావేద్, కట్ల రంగారావు, చకిలం రాజేశ్వరరావు, నాగండ్ల దీపక్‌చౌదరి, మద్దినేని బేబి స్వర్ణకుమారి, దైదా రవీందర్, కొత్త సీతారాములు, రఫీదాబేగం, ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.

మరింత మెరుగ్గా వ్యవసాయ విద్యుత్ సరఫరా



మాట్లాడుతున్న డైరెక్టర్ మధుసూదన్, పక్కన అధికారులు

ఖమ్మంవ్యవసాయం: వ్యవసాయ అవసరాలకు విద్యుత్ సరఫరాను మెరుగుపర్చాలని ఎన్పీడీసీఎల్ డైరెక్టర్(ఆపరేషన్స్) టి.మధుసూదన్ సూచించారు. ఎన్పీడీసీఎల్ చీఫ్ ఇంజనీర్ రాజుచౌహాన్‌తో కలిసి ఖమ్మంలో ఆయన గురువారం విద్యుత్ అధికారులు, ఉద్యోగులతో సమావేశమయ్యారు. జిల్లాలో విద్యుత్ సరఫరాపై, పన్నుల వసూళ్లపై చర్చించాక డైరెక్టర్ మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన, అంతరాయాలు లేని విద్యుత్ సరఫరా చేయాలని సూచించారు. వ్యవసాయ కనెక్షన్ల కోసం వచ్చిన దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించడమే కాక అవసరమైన చోట లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతు చేయాలని తెలిపారు. ఇదే సమయాన విద్యుత్ ఉద్యోగులు విధినిర్వహణలో జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఖమ్మం ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి, డీఈలు నంబూరి రామారావు, సీహెచ్.నాగేశ్వరరావు, ఎల్.రాములు, శ్రీనివాస్, బద్రుపవార్, ఈ.వెంకటేశ్వర్లు, ఎస్ఏఓ శ్రీధర్, ఏడీఈలు, ఏఏఓలు పాల్గొన్నారు.

ఇంతింతై.. వటుడింతై...



- నానాటికీ పెరుగుతున్న ఉమ్మడి జిల్లా జనాభా
- 2011 నాటికి 27.97 లక్షలుగా నమోదు
- ఇప్పుడు లెక్కిస్తే మరింత పెరిగే అవకాశం

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఉమ్మడి జిల్లాలో కొన్ని దశాబ్దాలుగా జనాభా పెరుగుదల నమోదవుతోంది. 1951 నుంచి గణాంకాలను పరిశీలిస్తే మొదట పదేళ్లలో 30.88 శాతం పెరగ్గా.. 1971లో 29.54శాతానికి పెరగడం గమనార్హం. 2001లో 16.39 శాతం పెరుగుదల ఉండగా, 2011లో 8.47శాతమే నమోదైంది. అయినప్పటికీ ఏ దశాబ్దంలోనూ జనాభా పెరుగుదలకు బ్రేక్ పడలేదు. 1951లో ఉమ్మడి జిల్లా జనాభా 8,08,002 మంది ఉండగా చివరగా జనగణన జరిగిన 2011లో 27,97,370కి చేరింది. షెడ్యూల్ ప్రకారం 2021లో జనగణన చేయాల్సి ఉన్నా కరోనాతో చేపట్టలేదు. వచ్చే ఏడాది ఏప్రిల్ నుంచి 2027 వరకు జన గణన షెడ్యూల్‌ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది.

పునర్విభజనతో..

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పునర్విభజన సందర్భంగా పోలవరం ప్రాజెక్టు ముంపు మండలాలు ఉన్నాయనే కారణంతో అప్పటి ఉమ్మడి ఖమ్మం, ప్రస్తుతం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు మండలాలు పూర్తిగా, రెండు మండలాలు పాక్షికంగా ఆంధ్రప్రదేశ్‌లో కలిపారు. ఇందులో కుక్కునూరు, వేలేరుపాడు, చింతూరు, కూనవరం, వరరామచంద్రాపురం మండలాలతోపాటు బూర్గంపాడులోని 12గ్రామాలు, భద్రాచలం పట్టణం మినహా మిగిలిన గ్రామాలు ఉన్నాయి. ఇక 2016లో చేపట్టిన జిల్లాల పునర్విభజన సందర్భంగా వాజేడు, వెంకటాపురం మండలాలను ములుగు జిల్లాలో, గార్ల, బయ్యారం మండలాలను మహబూబాబాద్ జిల్లాలో కలిపారు. దీంతో జిల్లాల పునర్విభజన నాటికి 2011 జనగణన ప్రకారం ఖమ్మం జిల్లాలో 14,01,639 మంది జనాభా మిగిలారు. ఇందులో పురుషులు 6,99,124 మంది, స్త్రీలు 7,02,515 మంది ఉన్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. కాగా, రాష్ట్ర జనాభా సగటులో జిల్లా తొమ్మిదో స్థానంలో ఉండగా, రోజుకు సగటున జిల్లాలో పది జననాలు నమోదవుతున్నాయి.

ఉమ్మడి జిల్లా జనాభా వివరాలు..

ఏడాది	జనాభా
1951	8,08,002
1961	10,57,542
1971	13,69,892
1981	17,51,574
1991	22,15,809
2001	25,78,927
2011	27,97,370

శరవేగంగా సింథటిక్ ట్రాక్ నిర్మాణం



ట్రాక్ నిర్మాణంపై సూచనలు చేస్తున్న సారంగపాణి

ఖమ్మం స్పోర్ట్స్: ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో రూ.8.35 కోట్ల వ్యయంతో అథ్లెటిక్స్ క్రీడాకారుల కోసం నిర్మిస్తున్న సింథటిక్ ట్రాక్ పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. ఇప్పటికే 400 మీటర్ల ట్రాక్ కోసం మొదటి దశ పనులను పూర్తి చేయగా, కాంక్రీట్ పనులు పదిరోజుల్లో పూర్తికానున్నా యి. అంతేకాక భారీ వర్షం పడినా నీళ్లు నిలవకుండా ట్రాక్ చుట్టూ కాల్వ తీశారు. ఈమేరకు ట్రాక్ పనులను అథ్లెటిక్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కె.సారంగపాణి గురువారం పరిశీలించి కాంట్రాక్టర్‌కు సూచనలను చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో ప్రస్తుతం మూడు సింథటిక్ ట్రాక్‌లు అందుబాటులో ఉండగా, ఖమ్మంలో నాలుగో ట్రాక్ సిద్ధమవుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి, కోచ్‌లు పాల్గొన్నారు.

సీటీసీ ఏసీపీపై బదిలీ వేటు

- ఇద్దరు కానిస్టేబుళ్ల సస్పెండ్
- బెదిరించి రూ.6లక్షలు లాక్కున్న ఘటనలో చర్యలు

ఖమ్మంక్రైం: మిర్చి వ్యాపారి గుమస్తాను బెదిరించి రూ.6లక్షలు లాక్కున్న ఘటనలో సూత్రధారిగా భావిస్తున్న ఏసీపీపై బదిలీ వేటు వేసిన ఉన్నతాధికారులు ఇద్దరు టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశారు. వారం క్రితం ఖమ్మంలోని ఓ వ్యాపారి గుమస్తా వెంకన్న నగదుతో వెళ్తుండగా ఇద్దరు కానిస్టేబుళ్లు తనిఖీ చేసి గంజాయి అమ్మగా వచ్చిన డబ్బేనని బెదిరించి లాక్కున్నారు. అయితే, పథకం ప్రకారం జరిగిన ఈ వ్యవహారంలో సీటీసీ ఏసీపీ రవికుమార్‌తో పాటు ఓ పత్రికా జర్నలిస్టు ఉండగా నగదును సదరు జర్నలిస్ట్ ఇంట్లో దాచారు. విషయం బయటపడడంతో ఉన్నతాధికారులు ఆగ్రహం వ్యక్తం చేయగా రూ.లక్ష మినహాయించుకుని రూ.5లక్షలు ఇచ్చేశారు. ఆపై మిర్చి వ్యాపారి ఫిర్యాదు చేయకుండా కొందరు ఒత్తిడి తీసుకొచ్చినట్లు సీపీ సునీల్‌దత్ నిఘావర్గాల ద్వారా చేయించిన విచారణలో బయటపడింది. ఈమేరకు ఏసీపీ రవికుమార్‌ను గురువారం డీజీపీ కార్యాలయానికి అటాచ్ చేయగా, టాస్క్‌ఫోర్స్ కానిస్టేబుళ్లు నాగరాజు, ఉపేందర్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా, ఈ ఘటనలో ప్రమేయం ఉన్న జర్నలిస్టును ఇప్పటికే ఆన్‌లైన్ మోసంలో కరీంనగర్ సైబర్ క్రైం పోలీసులు అరెస్ట్ చేసిన విషయం విదితమే.

క్లుప్తంగా

సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులు పంపిణీ చేసిన ఎంపీ



చెక్కులు అందుకున్న వారితో ఎంపీ రవిచంద్ర

ఖమ్మంమయూరిసెంటర్‌: అనారోగ్య కారణాలతో ప్రైవేట్‌ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకున్న వారికి తన సిఫారసుతో మంజూరైన సీఎంఆర్‌ఎఫ్‌ చెక్కులను ఎంపీ వద్దిరాజు రవిచంద్ర గురువారం అందజేశారు. ఖమ్మం బుర్హాన్‌పురంలోని క్యాంప్‌ కార్యాలయంలో ఆయన 13 మందికి చెక్కులు అందజేసి మాట్లాడారు. కార్పొరేటర్లు శీలంశెట్టి వీరభద్రం, తోట రామారావు, బీఆర్‌ఎస్‌ నాయకులు ఉప్పల వెంకటరమణ, పగడాల నరేందర్‌, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

చోరీ కేసుల్లో నిందితుడి అరెస్ట్‌

ఖమ్మంక్రైం: పలు చోరీ కేసుల్లో నిందితుడైన ఖమ్మం రేవతిసెంటర్‌కు చెందిన దోస్‌వాస్‌ ప్రేమ్‌కుమార్‌ను ఖమ్మం టూటౌన్‌ పోలీసులు గురువారం అరెస్ట్‌ చేశారు. గత కొన్నేళ్లుగా చోరీలకు పాల్పడుతున్న ఆయన జైలుకు వెళ్లివచ్చాడు. అయినా తీరు మార్చుకోక ఈ ఏడాది జనవరి, ఫిబ్రవరిలో ఖమ్మం మామిళ్లగూడెం, ద్వారకానగర్‌, వరదయ్యనగర్‌లోని ఇళ్లలోనే కాక వెంకటేశ్వరస్వామి గుడిలో చోరీ చేశాడు. అలాగే, ఏప్రిల్‌లో పటేల్‌ స్టేడియం వద్ద ఓ వ్యక్తి నుంచి రెండు బంగారు ఉంగరాలను దొంగిలించాడు. ఈమేరకు నిందితుడిని అరెస్ట్‌ చేసి రూ.7.50లక్షల విలువైన 155 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నామని సీఐ బాలకృష్ణ తెలిపారు.

డివైడర్‌ను ఢీకొని యువకుడు మృతి

ఖమ్మంరూరల్‌: మండలంలోని మద్దులపల్లి వద్ద ఖమ్మం – సూర్యాపేట రహదారిపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో అంబోజి నవదేవ్‌(23) మృతి చెందాడు. ఏపీలోని జగ్గయ్యపేట మండలం మల్కాపురానికి చెందిన నవదేవ్‌, ముదిగొండ మండలం గోకినపల్లికి చెందిన నరేందర్‌ బైక్‌పై గురువారం కూసుమంచి వైపు నుండి ఖమ్మం వస్తున్నారు. మార్గమధ్యలో మద్దులపల్లి మూలమలుపు వద్ద ద్విచక్ర వాహనం అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈ ఘటనలో నవదేవ్‌ మృతి చెందగా, నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. దీంతో నవదేవ్‌ మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్‌ చైర్మన్‌ శ్రీనివాసరావు సహకారంతో ప్రభుత్వాస్పత్రి మార్చురీకి తరలించారు.

నిందితుడి కోసం పోలీసుల గాలింపు

నేలకొండపల్లి: అత్యాచారం కేసులో నిందితుడి కోసం భద్రాద్రి జిల్లా గుండాల పోలీసులు గాలిస్తున్నారు. ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం రాజేశ్వరపురానికి చెందిన కుంభం వీరబాబు 2019లో గుండాల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో ఓ మహిళపై అత్యాచారం చేశాడు. ఈ ఘటనపై కేసు నమోదు కాగా, కోర్టు వాయిదాలకు హాజరుకావడం లేదు. దీంతో గురువారం గుండాల సీఐ ఎల్‌.రవీందర్‌, సిబ్బంది రాజేశ్వపురం వచ్చి ఆయన ఆచూకీ కోసం ఆరా తీశారు. ఆగస్టు 13లోగా న్యాయస్థానంలో హాజరయ్యేలా చూడాలని బంధువులకు సూచించారు. కాగా, వీరబాబు ఆచూకీ తెలిసిన వారు 87126 82082, 87126 82084 నంబర్లకు సమాచారం ఇవ్వాలని సీఐ రవీందర్‌ కోరారు.

కలిసుంటేనే.. కలదు సుఖం!

ఉమ్మడి కుటుంబం ఐక్యతకు ప్రతీక.. కష్టసుఖాలను పంచుకునే వేదిక. బంధం, అనుబంధం, ప్రేమానురాగాలతో బృందావనాన్ని తలపిస్తుంది. తాతయ్య, నాయనమ్మ, తల్లిదండ్రులు, బాబాయిలు, చిన్నమ్మలు, మేనత్తలు, మామలు, అన్నయ్యలు, తమ్ముళ్లు, అక్కలు, చెల్లెళ్లు, వదినలు, మరదళ్లు, బావలు, బావమరుదులతో ఆనందంగా జీవిస్తుంటారు. పూర్వకాలం నుంచి దేశంలో ఉమ్మడి కుటుంబ వ్యవస్థ ఉన్నప్పటికీ కాలక్రమంలో మార్పులు వచ్చాయి. స్వేచ్ఛ లేదని, ప్రైవసీ కొరవడుతుందనే భావనతో వేరు కుటుంబాలుగా జీవిస్తుండటంతో దాదాపు ఉమ్మడి కుటుంబ వ్యవస్థ అంతరించిపోయే దశకు చేరగా.. ఇంకా ఒకటో, రెండో కుటుంబాలు అక్కడక్కడా ఉమ్మడిగా జీవనం సాగిస్తున్నాయి. ఆ కుటుంబాల గురించి తెలుసుకుందాం. – ఖమ్మంగాంధీచౌక్‌



- ఉమ్మడి కుటుంబాలతోనే జీవన మాధుర్యం
- కష్టసుఖాల్లో ఒకరికి అందరూ.. అందరికీ ఒకరు
- ప్రేమానురాగాలు, వ్యవహారిక జ్ఞానం ద్విగుణీకృతం

ఒంటరితనం దూరం.. ప్రయోజనాలనేకం

ఉమ్మడి కుటుంబతో ఒంటరితనం దూరమవుతుంది. కుటుంబ వాతావరణం పిల్లల్లో సానుకూల ప్రభావం చూపుతుందని, వ్యవహారిక జ్ఞానం పెంచుతుందని, మానసిక పరిపక్వతకు దోహదం చేస్తుందని నిపుణులు చెబుతున్నారు. ప్రస్తుత సామాజిక పరిస్థితుల్లో ప్రతి జంట 'మేమిద్దరం.. మాకొక్కరు'అనే విధానాన్ని అనుసరిస్తున్నారు. దీంతో తోబుట్టువులు లేకపోవడంతో చిన్నారులు ఎక్కువ శాతం మంది ఒంటరితనానికి లోనవుతున్నారని నిపుణుల పరిశీలనలో తేలింది. ఆడుకునేందుకు తమ ఈడు పిల్లలు లేకపోవడం, ఒక్క సంతానమని తల్లిదండ్రులు గారాబంగా, బయటకు వెళ్లనీయకుండా పెంచడంతో ఒంటరితనానికి లోనవుతున్నారు. ఉమ్మడి కుటుంబంలో ఈ సమస్య రాదని నిపుణులు చెబుతున్నారు. చిన్నాన్న, పెదనాన్న పిల్లలతో కలిసి ఆనందంగా గడుపుతారు. ఒంటరిగా చదువుకోలేని పిల్లలు ఉమ్మడిగా చదువులో కూడా రాణిస్తారు. నాయనమ్మ, తాతయ్యలతో ఉంటే నీతికథలు వింటూ అనుభవాలను పెంచుకునే అవకాశం ఉంటుంది. ఆనందంగా గడిపే పిల్లలు శారీరకంగా, మానసికంగా పటిష్టంగా ఉంటారు. పెద్దల సలహాలు లభిస్తాయి. బాధలో ఉన్నప్పుడు ఓదార్పు, అభయం లభిస్తుంది. మహిళలకు గౌరవం, హుందాతనం లభిస్తుంది.

మార్గదర్శకం.. కురువెళ్ల కుటుంబం



ఉమ్మడి కుటుంబానికి మార్గదర్శకం కురువెళ్ల కుటుబం అని చెప్పవచ్చు. ఖమ్మం నగరంలో అనాదిగా కురువెళ్ల కుటుంబం వ్యాపార రంగంలో రాణిస్తోంది. కురువెళ్ల వెంకటేశ్వరరావు, మంగతాయారు దంపతులకు ఎనిమిది మంది సంతానం. ఏడుగురు కుమారులు, కూతురు ఉన్నారు. వెంకటేశ్వరరావు 70 ఏళ్ల కిత్రం కమీషన్‌ మర్చంట్‌గా వ్యాపారం ప్రారంభించి రాణించారు. కుటుంబాన్ని ఉమ్మడిగా ఉంచటంలో మార్గదర్శకంగా నిలిచారు. కుమారులు, కూతురు వేర్వేరు వ్యాపారాలు చేస్తున్నా అందరూ కలిసే ఉంటున్నారు. ఖమ్మం త్రీటౌన్‌లో కురువెళ్ల టవర్స్‌ పేరిట ప్రత్యేకంగా అపార్ట్‌మెంట్‌ నిర్మించుకుని నివసిస్తున్నారు. ఈ ఎనిమిది కుటుంబాలకు 16 మంది సంతానం ఉన్నారు. వీరిలో కొందరు విదేశాల్లో కూడా స్థిరపడ్డారు. ఏ శుభకార్యం జరిగినా అందరూ కలిసి అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని కుటుంబీకులు తెలిపారు.

పాకనాటి కుటుంబం ఉన్నతి



పాకనాటి కుటుంబం ఉమ్మడిగా ఉంటూ ఉన్నత స్థితికి చేరింది. నేలకొండపల్లి మండలం అనంతనగర్‌కు చెందిన పాకనాటి ముత్తారెడ్డి, ముత్తమ్మ దంపతులకు ఐదుగురు కుమారులు, ఇద్దరు కుమార్తెలు. మధ్య తరగతి వ్యవసాయ కుటుంబంగా ఉన్న ముత్తారెడ్డి కుమారులను, కుమార్తెలను చదివించారు. పెద్ద కుమారులు ఇద్దరు వ్యవసాయం చేస్తుండగా, చిన్న కుమారులు ముగ్గురు ఉద్యోగాలు చేస్తున్నారు. కుమార్తెలు తాము ఎంచుకున్న వృత్తిలో రాణిస్తున్నారు. ఈ ఏడుగురికి 10 మంది సంతానం కలిగారు. వీరు ఉన్నత చదువులు చదివి స్థానికంగా, అమెరికాలో స్థిర పడ్డారు. కుటుంబంలో శుభకార్యాలు జరిగితే అంతా కలిసి ఆనందంగా గడుపుతారు. కుటుంబం ఐక్యంగా ఉంటూ ఉన్నతంగా నిలుస్తున్నారు.

నేడు ప్రపంచ జనాభా దినోత్సవం

- చిన్న కుటుంబాలుగా మారిన సమాజం
- అమ్మ, నాన్న, ఒక్కరిద్దరు పిల్లలతో జీవనం

ఆర్థిక పరిస్థితుల వల్లే..



సమాజంలో ఆర్థిక పరిస్థితులు, స్వార్థం, నేను అనే భావన వంటి కారణాలతో ఉమ్మడి కుటుంబాలు కాస్త చిన్న కుటుంబాలుగా మారిపోయాయి. నేడు కుటుంబం అంటే భార్య, భర్త, వారి ఒకరిద్దరు సంతానం మాత్రమే. ఇలాంటి కుటుంబాలు ఆర్థికంగా బలపడినా మానసికంగా మాత్రం బలహీనపడుతున్నాయని నిపుణులు చెబుతున్నారు. ఇందుకు ఆయా కుటుంబాల పిల్లల మానసిక పరిపక్వత ప్రత్యక్ష నిదర్శనంగా నిలుస్తోంది. చిన్న కుటుంబాల్లో మంచి మాటలు చెప్పే పెద్దలు లేకపోవడంతో పిల్లలు టీవీ, సెల్‌ఫోన్‌లకు బానిసలవుతున్నారు. ఇది వారి ఆరోగ్య స్థితిగతులపై కూడా ప్రభావం చూపుతోంది. – నేలకొండపల్లి/ఇల్లెందురూరల్‌

చాలా సంతోషంగా ఉన్నాం



కుమారుడు శ్రీలలిత్‌ సారితో శ్రీనివాస్‌-లావణ్య

నేలకొండపల్లికి చెందిన పసుమర్తి శ్రీనివాస్‌–లావణ్య దంపతులు ఆర్థిక పరిస్థితుల నేపథ్యంలో సంతానం ఒక్కరు చాలని నిర్ణయించుకున్నారు. వీరికి కుమారుడు శ్రీ లలిత్‌ సారి ఉన్నాడు. ప్రస్తుతం పెరుగుతున్న ధరలు, పిల్లలకు కనీస అవసరాలు తీర్చడం కోసం అధిక మొత్తాలను వెచ్చించాల్సి రావడం వంటి సమస్యలను గుర్తించి ఒక్కరు చాలనకున్నామని, ఒక్క బాబుతో సంతోషంగా జీవనం సాగిస్తున్నామని ఆ దంపతులు తెలిపారు. ఇదే మాదిరి ఆర్థిక భారం పెరగడంతో చాలా మంది దంపతులు ఒకరి కంటే ఎక్కువ మంది పిల్లల్ని కనడంపై ఆసక్తి చూపించడం లేదు. విద్య, వైద్యం, ఆహారం, బట్టలు తదితర అవసరాల కోసం భారీగా ఖర్చు పెరుగుతుంది. తక్కువ ఆదాయం ఉన్న కుటుంబాలలో ఇదో పెద్ద సమస్యగా మారుతోంది. దీంతో పాపైనా, బాబైనా ఒక్కరితోనే సరిపెట్టుకుంటున్నారు.

నా కష్టం పిల్లలు పడకూడదని..



కుమార్తె బిందుతో రామనాథం - భారతి

మాది పెద్ద కుటుంబం. ఎనిమిది మంది సభ్యులం. ఇంత మందిని పోషించడం అమ్మనాన్నలకు ఇబ్బందిగా ఉండేది. చాలా రోజులు ఆహారం లేక ఉపవాసంతోనే నిద్రించేవాళ్లం. ఆ పరిస్థితి నా పిల్లలకు ఎదురవ్వొద్దని నా చిన్నతనంలోనే నిర్ణయించుకున్నా. నాకు రామనాథంతో పెళ్లయ్యాక భర్తను ఒప్పించి కొడుకైనా, కూతురైనా ఒక్కరే చాలనుకున్నాం. కుమార్తె జన్మించింది. ఉన్న కొద్దిపాటి భూమిని సాగు చేసుకుంటూ, రెక్కల కష్టంతో కుమార్తెను సుఖంగా పోషించుకుంటున్నాం. ఆమెను ప్రయోజకురాలిని చేయాలన్నదే మా లక్ష్యం. – చింత భారతి – రామనాథం, కుంజవారిగూడెం, ఇల్లెందు మండలం

తుది దశకు యూటీ నిర్మాణం



పనులను పరిశీలిస్తున్న ఎస్‌ఈ, అధికారులు

కూసుమంచి: పాలేరు రిజర్వాయర్‌కు సమీపాన సాగర్‌ ఎడమ కాల్వ యూటీ (అండర్‌ టన్నెల్‌) గత ఏడాది వరదలతో కొట్టుకుపోగా కొత్త యూటీ నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి. మరో పది రోజుల్లో పనులు పూర్తిచేస్తే సాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఉండవనే భావనతో అధికారులు నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఆగస్టు మొదటి వారంలో పాలేరు రిజర్వాయర్‌ నుండి ఆయకట్టుకు నీరు విడుదల చేసే అవకాశమున్నందున ఆలోగా పూర్తిచేయాలనే లక్ష్యంతో ఉన్నారు. కాగా, కాల్వకు 1965లో నిర్మించిన యూటీ గత ఏడాది వరదలకు తెగిపోయింది. దీంతో మరోమారు భారీ వరదలను వచ్చినా తట్టుకునేలా నిర్మిస్తున్నట్లు జలనవరుల శాఖ ఎస్‌ఈ ఎం.వెంకటేశ్వర్లు వివరించారు. ఈమేరకు ఆయన గురువారం పనులను పరిశీలించారు.

నీట్‌లో 'న్యూవిజన్‌'కు ర్యాంక్‌లు

ఖమ్మం సహకారనగర్‌: నీట్‌ రాష్ట్ర స్థాయి ర్యాంకులు విడుదల చేయగా, ఓపెన్‌ కేటగిరీలో న్యూవిజన్‌ విద్యార్థి మాచినేని ఆకాంక్ష 89, కేటగిరీలో పిల్లలమర్రి సంహిత 29వ ర్యాంక్‌ సాధించినట్లు విద్యాసంస్థల చైర్మన్‌ సీహెచ్‌జీకే.ప్రసాద్‌ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించాక ఆయన మాట్లాడారు. ముప్పా వైష్ణవి 33, లకావత్‌ సాయిచరణ్‌ 86, బానోతు గోపీచంద్‌ 91, ముత్తినేని బిందుప్రియ 163, మిన్హాజ్‌ ఆరా 178, భుక్యా సాయిశృతి 264, రాజపుత్ర శీతల్‌ 297, తేజావత్‌ దివ్య 327, బానోతు చైతన్యసాయి 345, జి.అనుప్రియ 427, కాకి వేదనందన 528, భూక్యా అక్షిత 531, మేరుగు వందన 598, చింతరెడ్డి హాసినిరెడ్డి 648, కంచెపోగు సుష్మా 695, జర్పుల వివేక్‌నాయక్‌ 741, బోడ యశ్వంత్‌ 743, అంజుమ్‌ 756, గంగ్వాల్‌ గీతిక జైన్‌ 795, బండెల అక్షిత్‌ 986వ ర్యాంక్‌ సాధించారన్నారు. డైరెక్టర్లు కార్తీక్‌, సీహెచ్‌.గోపీచంద్‌, ప్రిన్సిపాల్‌ బ్రహ్మచారి, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

'హార్వెస్ట్‌' విద్యార్థులకు..

నీట్‌ రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో తమ విద్యార్థులకు మెరుగైన స్థానాలు దక్కించుకున్నారని హార్వెస్ట్‌ కరస్పాండెంట్‌ పి.రవిమారుత్‌, ప్రిన్సిపాల్‌ పార్వతిరెడ్డి తెలిపారు. టీడీవీఎస్‌ఎస్‌.సైమాంజలి 194వ ర్యాంక్‌ సాధించగా, గండు రాని, ఉమా అలేఖ్య 305, ఎం.డీ.అన్నియా ముస్కాన్‌ 951, సరోజ్‌ రాజ్‌పుత్‌ పురోహిత్‌ 1,295, బానోతు భార్గవి 2,059, శ్యామ్‌ 2,778, సాధు జాహ్నవి 6,914, గుగులోతు శ్రీమయి 9,023వ ర్యాంక్‌ సాధించారని వెల్లడించారు.

'శ్రీ చైతన్య' విద్యార్థులు...

ఖమ్మం సహకారనగర్‌: నీట్‌ రాష్ట్రస్థాయి ర్యాంకుల్లో తమ విద్యార్థులు ప్రతిభ కనబర్చారని శ్రీచైతన్య విద్యాసంస్థల చైర్మన్‌ మల్లెంపాటి శ్రీధర్‌, డైరెక్టర్‌ శ్రీవిద్య తెలిపారు. డి.దుర్గా గుజిరి 30వ ర్యాంక్‌ సాధించగా, ఎల్‌.మనోహర్‌ 50, వైఎస్‌.స్ఫూర్తిక 81, బి.చందన 96, బి.రిషిత 134, కె.సాయిజశ్వంత్‌ 267, వి.రోహిత 300, జి.అక్షయ 320, జి.సాయిప్రణవి 344, బి.భూమిక 351, జి.శ్రీనిధి జ్యోతిర్మయి 369, ఎస్‌.లహరి 408, డి.శ్రీలేఖ 434, జి.హర్షిత 435, పి.శ్రీవర్ష 445, డి.స్వరాజ్‌ పాల్‌ 511, ఏ.లిఖిత 544, వి.ప్రియాంక 551, ఏ.లిఖిత 544, వి.ప్రియాంక 552, కె.తేజస్విని 651, కె.శివాని వాగ్దేవి 660, ఎస్‌.కే.సాఫియా 671, కె.హాసిని 768, కె.శృతి 778, జి.హేమశ్రీ 793, ఎం.డీ.సిద్రా 810, బి.విషి 834, డి.విక్టర్‌ పాల్‌ 944, బి.మాన్యశ్రీ 944వ ర్యాంక్‌ సాధించారన్నారు. ఈకార్యక్రమంలో డైరెక్టర్‌ డాక్టర్‌ బి.సాయిగీతిక, డీజీఎం చేతన్‌ మాథూర్‌తో పాటు వర్మ, కృష్ణ, సీహెచ్‌.బ్రహ్మం, ప్రకాష్‌, గోపాలకృష్ణ పాల్గొన్నారు.